# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 13 । జనవరి । 2023




**29న మోదకొండమ్మ తీర్థం**

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి IIలో



**కౌన్సెలింగ్ కేంద్రాలతో ఆత్మహత్యల నివారణ** IIలో



**పల్లెలకు సంక్రాంతి శోభ**

పాఠశాలల్లో విద్యార్థులకు సంప్రదాయ పండగలపై అవగాహన కల్పించేందుకు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. IIIలో

## న్యూస్‌రీల్

### వాగులో పడి విద్యార్థి మృతి

**అడ్డతీగల:** మండలంలోని పైడిపుట్ట వద్ద గురువారం కన్నేరువాగులో పడి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన చెరుకూరి విద్యాలయం టెన్త్ విద్యార్థి డోకుబుర్ర సుభాష్(15) మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలోని చెరుకూరి విద్యాలయం నుంచి కొంత మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విహారయాత్ర కోసం గురువారం ఉదయం అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్ద కన్నేరు వాగు పరిసరాలకు వచ్చారు. స్నానాలు చేసేందుకు విద్యార్థులు వాగులోకి దిగారు. వీరిలో టెన్త్ విద్యార్థి డోకుబుర్ర సుభాష్ నీటిలో మునిగి అపస్మారక స్థితికి చేరాడు. మిగతా విద్యార్థులు, ఉపాధ్యాయులు అతడిని హుటాహుటిన బయటకు తీశారు. విద్యాలయానికి చెందిన బస్సులో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

### గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్

స్టడీ టూర్ కమిటీ సమావేశంలో అరకు ఎంపీ మాధవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాధవి

**కొయ్యూరు:** ట్రైఫెడ్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. గోవా రాజధాని పనాజీలో నిర్వహిస్తున్న ఎస్టీ,ఎస్సీ సంక్షేమ కమిటీ స్టడీ టూర్ సమావేశంలో పాల్గొన్నారు. మన్యంలో సాగు చేస్తున్న వాణిజ్య పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ద్వారా గిరిజనుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని సూచించినట్టు ఆమె తెలిపారు.

### చింతూరు సబ్ కలెక్టర్ బదిలీ

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా నియామకం




సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**చింతూరు:** చింతూరు సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా వెళ్లారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన చింతూరు రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విధులు నిర్వహించిన రెండున్నర నెలల కాలంలో ఆయన విలీన మండలాల్లో పలు సమస్యలను పరిష్కరించారు.

### కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్



కాఫీ రైతులతో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

**చింతపల్లి రూరల్:** గిరి రైతులు పండించిన కాఫీకి గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని గిరిజన సహకార సంస్థ ఎండీ వి. సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కిటుముల, లంబసింగి,బురడవీధి గ్రామాల్లో పర్యటించారు. కాఫీ రైతులతో మాట్లాడారు. జీసీసీ ద్వారా కిలో పార్చిమెంట్ రూ.270, కిలో చెర్రి రూ. 135 కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. జీసీసీ వల్ల కాఫీకి మంచి ధరలు వస్తున్నాయని గిరిజనులు తెలిపారు. అందుకు తగ్గట్టుగా జీసీసీ అధికారులు సహకారం అందిస్తున్నారన్నారు. బీఎం సింహాచలం పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

**మోతుగూడెం:** సంక్రాంతి పండగ పురస్కరించుకొని మోతుగుడెంలో గురువారం ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఏపీ జెన్‌కో, స్పోర్ట్స్ కౌన్సిల్ సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నట్టు కౌన్సిల్ సెక్రటరీ ఆర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలను స్థానిక చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, బాబూరావు లాంఛనంగా ప్రారంభించారు.

పర్యాటకంగా విశేష ఆదరణ పొందిన రంపచోడవరం ప్రాంతంలో సందర్శనీయ ప్రాంతాల్లో వసతులు మెరుగుపడుతున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా వారికి అవసరమైన స్థాయిలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది.



ఐ.పోలవరం వద్ద ఏర్పాటు చేసిన గిరిజనుల ప్రతిమలు

# ఆహ్లాదం పంచేలా..

- రంపచోడవరం ప్రాంతంలో వసతులపై దృష్టి పెట్టిన పర్యాటకశాఖ
- రూ. కోటి వ్యయంతో పార్కు నిర్మాణం
- హట్స్‌తోపాటు పిల్లల పార్కు
- సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు

**రంపచోడవరం:** మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. వీరికోసం పర్యాటకశాఖ పూర్తిస్థాయిలో వసతులను అందుబాటులోకి తెస్తోంది. దీనిలో భాగంగా రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లో పర్యాటకశాఖ అతిథి గృహాలను నిర్మించింది. గతంలో కార్తీకమాసంలో మాత్రమే పర్యాటకుల తాకిడి ఉండేది. ఇప్పుడు సీజన్‌తో సంబంధం లేకుండా పర్యాటకులు ప్రతిరోజు వందల సంఖ్యలో తరలివస్తున్నారు. ఒక వైపు మారేడుమిల్లి ప్రాంతంలోని జలపాతాలు, గుడిసె అందాలు, మరోవైపు గోదావరి పర్యాటకం పాపికొండలు అందాలు ఏజెన్సీ ప్రాంతానికి రారమ్మని పిలుస్తున్నాయి.

- **ఏజెన్సీకి పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ రంగం ఆధారపడిన వందల సంఖ్యలో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.**
- రంపచోడవరానికి సమీపంలోని ఐ.పోలవరం వంతెన వద్ద రూ. కోటి వ్యయంతో పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు రూర్బాన్ నిధులు వెచ్చిస్తున్నారు. అక్కడకు వచ్చే పర్యాటకుల కోసం హట్స్, పార్కు, పిల్లల ఆట వస్తువులు అందుబాటులోకి తీసుకువచ్చారు.
- **పార్కులో పచ్చిక బయళ్లతో అందంగా తీర్చిదిద్దడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.** పనులు చివరి దశకు చేరుకోవడంతో త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.
- పార్కు ఆవరణలో గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మించిన నిర్మించిన ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి
- **కొంతకాలంగా నిలిచి పోయిన గుడిసె పర్యాటకం తిరిగి** ప్రారంభం కావడంతో **ఏజెన్సీకి వచ్చే పర్యాట**కుల సంఖ్య విపరీతంగా **పెరిగింది.**
- కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సీబీఈటీ)లో భాగంగా గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీబీఈటీలకు వచ్చిన ఆదాయంలో కొంత గిరిజనులకు ఇస్తున్నారు.
- రంపచోడవరంలో పది సూట్ రూమ్స్, హోటల్‌తో కూడిన పర్యాటక అతిథి గృహం అందుబాటులో ఉంది. మారేడుమిల్లిలో ఉడ్, ఎకో టూరిజం అతిథి గృహాలతో పాటు ప్రైవేట్ అతిథి గృహాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

## ఆకర్షణీయంగా డుడుమ



డుడుమ జలపాతం వ్యూపాయింట్ వద్ద నిర్మించిన రక్షణ వలయం



డుడుమ మెట్ల మార్గానికి ఏర్పాటుచేసిన రక్షణ

**ముంచంగిపుట్టు:** ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని డుడుమ జలపాతం వద్ద పర్యాటకుల సౌకర్యార్థం వసతులు మెరుగుపడుతున్నాయి. జలపాతం వ్యూపాయింట్, మెట్ల మార్గం, పార్క్ పరిసరాలను రూ.10 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు. రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మెట్ల మార్గంలో రెండు వైపులా, వ్యూపాయింట్ చుట్టూ రక్షణ కంచె నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. జలపాతం వద్ద ఉన్న పార్క్‌లో పర్యాటకుల వేచి ఉండేందుకు విభిన్నంగా కేంద్రాలు నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని విస్తరించారు. ఆధునిక హంగులతో అతిథి గృహం నిర్మించారు. ఒడిశా ప్రభుత్వం,ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు ఇందుకు అవసరమైన నిధులు వెచ్చించారు. సౌకర్యాలు మెరుగుపడటంతో పర్యాటకుల్లో ఆనందం నెలకొంది,



పర్యాటకుల కోసం తీర్చిదిద్దిన పార్కు



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటల పరికరం

### వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తాం

ఐ పోలవరం వద్ద చేపట్టిన పార్క్ వారం రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మారేడుమిల్లిలో అదనపు కాటేజీలు నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. వాటికి అనుమతులు వస్తే పర్యాటకులకు మరింత వసతి సౌకర్యం మెరుగుపడుతుంది.

–రాజారావు, ఈఈ, పర్యాటక శాఖ, కాకినాడ

## ఏఎస్పీ వై.రామవరం పోలీసుస్టేషన్ సందర్శన





నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



వాలీబాల్ టోర్నమెంటును తిలకిస్తున్న రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

**వై.రామవరం:** స్థానిక పోలీసు స్టేషన్‌ను రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా గురువారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన పోలీసుస్టేషన్ భవనాన్ని పరిశీలించారు.స్టేషన్ ఆవరణలోని సీఆర్పీఎఫ్ డీ42 బెటాలియన్ సెంట్రీ పోస్టులు, తదితర భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎక్సర్‌సైజులను పరిశీలించారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై ఆరా తీశారు. పలు అంశాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డీ42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు సీఐ వై.రాంబాబు, ఎస్ఐ సంతోష్‌కుమార్, అడిషినల్ ఎస్ఐ కె.రాంబాబు. సీఆర్పీఎఫ్ డీ42 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

**వాలీబాల్ పోటీలు ప్రారంభం**

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గురువారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. వీటిని సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. పోటీలను ఏఎస్పీ తిలకించారు. 22 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు.

# అడవి బిడ్డలకు బాసటగా..

**అడవి బిడ్డల కష్టానికి తగిన ప్రతిఫలం కల్పించేందుకు గిరిజన సహకార సంస్థ తీవ్రంగా శ్రమిస్తోంది. అడవి బిడ్డలు సేకరిస్తున్న విభిన్న రకాల ఉత్పత్తులకు 'బ్రాండింగ్' కల్పిస్తూ.. అందరికి అందుబాటులో ఉంచేందుకు వినూత్న విధానాన్ని అవలంభిస్తోంది. వన్ స్టేషన్.. వన్ ప్రాడక్ట్‌లో భాగంగా.. రైల్వేస్టేషన్లలో జీసీసీ ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేసేలా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుకు అడుగులు వేస్తోంది. ఇప్పటికే రెండు స్టేషన్లలో స్టాళ్లు ఏర్పాటు చేసిన జీసీసీ.. త్వరలో మరో మూడు స్టేషన్లలోనూ అందుబాటులోకి తీసుకొచ్చేలా వడివడిగా అడుగులు వేస్తోంది.**

- రైల్వేస్టేషన్లలో జీసీసీ స్టాళ్లు
- తొలి విడత ఐదు స్టేషన్లలో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే విజయవాడ, రాజమండ్రిలో స్టాళ్లు
- త్వరలో విశాఖపట్నం, గోపాలపట్నం, దువ్వాడ స్టేషన్లలో..
- పసుపు నుంచి కాఫీ వరకూ అన్ని ఉత్పత్తుల విక్రయం

**సాక్షి, విశాఖపట్నం:** కొండల్లో లభించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తుల్ని సేకరిస్తూ.. వాటిని విక్రయిస్తున్న గిరిజనులకు ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతని భుజస్కందాలపై వేసుకున్న జీసీసీ.. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో అడుగులు వేస్తోంది. గిరిపుత్రులు సేకరించే వాటిని గిరిజన సహకార సంస్థ ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తోంది. ఇవి అరుదుగా దొరికే రకాలు, స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంది. ముఖ్యంగా తేనె, చింతపండు, త్రిఫల చూర్ణం, నన్నారి, అలోవిరా, జాస్మిన్, నీమ్ ఇంటర్నేషనల్ సబ్బులు, ఉసిరి, శీకాకాయ, కుంకుడు కాయలు, వీటిద్వారా తయారుచేసిన షాంపులు, రాజ్మా చిక్కుళ్లతో పాటు వందకు పైగా విభిన్న రకాల ఉత్పత్తులు సేకరిస్తున్నారు. ఇవన్నీ ఎలాంటి కల్తీ లేకుండా లభించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులు. వీటిని ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేసి 'జీసీసీ' పేరుతో బ్రాండింగ్ చేస్తున్నారు. ఇంకొన్ని ఉత్పత్తుల ద్వారా సబ్బులు, షాంపులతో పాటు అరకు కాఫీ, వైశాఖీ కాఫీపొడి తయారుచేస్తున్నారు. వీటి కోసం హైదరాబాద్, తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నంలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి నేరుగా మార్కెట్లకు విక్రయిస్తున్నారు. వీటి బ్రాండింగ్‌తో పాటు మార్కెటింగ్ విశాఖపట్నంలోని జీసీసీ ఆధ్వర్యంలో జరుగుతోంది. బ్రాండింగ్, వాటి ధర, ఉత్పత్తికి సంబంధించిన పూర్తి వివరాలు ప్యాకెట్‌పై ముద్రిస్తున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా వీటికి ఎక్కువ డిమాండ్ ఉంది.

**మరింత ఊతమిచ్చేలా..**

ప్రస్తుతం ఉన్న విక్రయాలకు మరింత ఊతమందించేందుకు రైల్వేస్టేషన్లలోనూ ఈ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లను ఏర్పాటు చేయాలని జీసీసీ భావించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రైల్వే శాఖతో జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ సంప్రదింపులు జరిపారు. ఇప్పటికే రెండు స్టేషన్లలో వన్ స్టేషన్.. వన్ ప్రాడక్ట్ కార్యక్రమంలో భాగంగా జీసీసీ స్టాల్స్ ఏర్పాటుకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో రెండు రోజుల క్రితమే.. విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్లలో జీసీసీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నారు. త్వరలోనే విశాఖపట్నం, దువ్వాడ, గోపాలపట్నం రైల్వే స్టేషన్లలోనూ జీసీసీ స్టాళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెలాఖరులోగా ఆయా స్టేషన్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి.. విక్రయాలు చేపట్టేందుకు జీసీసీ ఎండీ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్

### గిరి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్



గిరిజన ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుండడంతో గిరిజనులు కూడా ఎక్కువగా అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్నారు. అంతేకాక, వారి పొలాల్లో ఇతర పంటలు పండించి వాటిని అందిస్తున్నారు. వీరు సేకరిస్తున్న ఉత్పత్తులను వినియోగదారులకు జీసీసీ అందుబాటులోకి తేవడం ద్వారా కల్తీలేని స్వచ్ఛ ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నాం. మార్కెట్‌లో జీసీసీ బ్రాండ్ ఉత్పత్తులు భారీగా సేల్ అవుతున్నాయి. అందుకే ఉత్పత్తులకు మార్కెట్‌ని మరింత పెంచేందుకు రైల్వే స్టేషన్లలో స్టాళ్ల ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. ఇప్పటికే ఆ దిశగా సఫలీకృతులయ్యాం. దీని ద్వారా గిరిజనుల ఆర్థిక స్థోమత మరింత పెరిగే అవకాశాలున్నాయి.

– సురేష్‌కుమార్, జీసీసీ ఎండీ

## ఆంధ్రా కశ్మీర్‌లో సంక్రాంతి సందడి



తాజంగి జలాశయం వద్ద సంబరాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మంత్రి అమర్‌నాథ్ కుటుంబసభ్యులు

- ఘనంగా సంబరాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మంత్రి అమర్‌నాథ్ కుటుంబ సభ్యులు

**చింతపల్లి:** ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో గురువారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. తాజంగి జలాశయం వద్ద భోగి మంటలు ఏర్పాటు చేసి ఉత్సాహంగా గడిపారు. బుధవారం రాత్రి ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కుటుంబ సమేతంగా లంబసింగిలో పర్యటించారు. రాత్రి ఇక్కడే బసచేసి వేకువజామున మంచు అందాలు వీక్షించి సంక్రాంతి వేడుకలు ప్రారంభించాల్సి ఉంది. అత్యవసర సమాచారం మేరకు ఆయన పర్యటన మధ్యలో వెళ్లాల్సి వచ్చింది. దీంతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మంత్రి కుటుంబ సభ్యులు తాజంగి జలాశయం వద్ద భోగి వేడుకలను వేడుకలను ప్రారంభించారు. అనంతరం చెరువుల వేనం కొండపై ప్రకృతి అందాలను వీక్షించారు. ఫొటోలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, సర్పంచ్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## గండిపోశమ్మ ఆలయ పరిరక్షణకు కసరత్తు

**దేవీపట్నం:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవతున్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయ ప్రాంతాన్ని ఇంజినీరింగ్ నిపుణులు గురువారం సందర్శించారు. జలవనరుల శాఖ ఈఈ పాండురంగయ్య, ఏఈ దొరబాబు, మేఘా ఇంజినీరింగ్ కంపెనీ ఏజీఎం క్రాంతికుమార్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. ముంపునకు గురవుతున్న అమ్మవారి స్వయంభువు ఆలయాన్ని ముంపు బారిన పడకుండా రక్షణగోడ నిర్మించి కాపాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ ప్రాంతాన్ని చిత్రపటం ద్వారా పరిశీలించారు. అమ్మవారి ఆలయ రక్షణకు సంబంధించిన నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆలయ ఈవో లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య తదితరులు

## చలిగాలుల విజృంభణ

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 5 డిగ్రీల నమోదు



పాడేరులో చలిమంట కాగుతున్న స్థానికులు

**సాక్షి,పాడేరు:** జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి.కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతుండడంతో సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలుల వ్యాప్తితో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీలు, అరకులోయలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ప్రజలు చలిమంటలను ఆశ్రయించి ఉపశమనం పొందారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

**జి.మాడుగుల:** వాతావరణ మార్పుల వల్ల సంభవించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా సమీప పీహెచ్‌సీలను సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలో ప్రసవ గదులను, స్టోర్ రూంను పరిశీలించారు. వసతుల వివరాలను తెలుసుకున్నారు. జీఎం కొత్తూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థినులకు నిర్వహిస్తున్న రక్తహీనత పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శశికాంత్, రవి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ఎన్ ప్రకాష్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**హాల్ టికెట్ల పంపిణీ**

**పాడేరు రూరల్:** జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న 1620 మంది నిరక్షరాస్యులైన ఆశా కార్యకర్తలకు దూర విద్య విధానం ద్వారా 3,5,8 తగరతి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. గురువారం పాడేరులో నిర్వహించిన ఆశా నోడల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న నిరాక్షరాస్యత కలిగిన ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించి ఈనెల 22న రాత పరీక్ష నిర్వహిస్తున్నామని డీఈవో డాక్టర్ రమేష్ తెలిపారు. గురువారం అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు హాల్ టికెట్లను అందజేశారు. ఏడీఎంహెచ్‌వో, సికిల్‌సెల్ అనీమియా ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె. లీలాప్రసాద్, ఎపిడమిక్ సెల్ హెల్త్ సూపర్‌వైజర్ గుల్లెలి సింహాద్రి. జిల్లా టీబీ పర్యవేక్షకుడు వి. కిరణ్, ఆశా డీసీఎం మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



జి.మాడుగుల పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

## క్లుప్తంగా

### మోదమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

**సాక్షి,పాడేరు:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఆలయ కమిటీ ప్రతినిధులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తకులు హుండీలలో నగదు లెక్కింపు చేపట్టారు. నాలుగు నెలలకు ఓసారి హుండీలలో ఆదాయాన్ని లెక్కిస్తారు.ఈసారి కూడా భక్తులు భారీగానే అమ్మవారికి నగదు, బంగారం, వెండి రూపంలో కానుకలు వేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు డి.బాబూరావు, సోమరాజు, రత్నం, రామా రావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### 2,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

సారాతో ఒకరి అరెస్ట్



జెడ్.జోగింపేటలో పట్టుపడిన పులుపుతో కొత్తకోట పోలీసులు

**రావికమతం:** మండలంలోని దిడ్డి, జెడ్.జోగింపేట గ్రామాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,500 లీటర్ల బెల్లం పులుపును రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, విభీషణరావు తమ సిబ్బందితో కలిసి గురువారం ధ్వంసం చేశారు. రెండు లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేశారు. వారి వివరాల మేరకు.. తమకు ముందస్తు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో దాడి చేశారు. పులుపును ధ్వంసం చేయడమేగాక పాత్రలను దహనం చేశారు. తోటకూరపాలెంలో రెండు లీటర్ల సారా కలిగి ఉన్న సూరెడ్డి రాజుబాబును అరెస్ట్ చేసినట్టు రావికమతం ఎస్‌ఐ తెలిపారు.

# సంతలకు సంక్రాంతి శోభ

భారీగా వస్త్ర వ్యాపారం



మద్దిగరువు సంతలో కుట్టుపనిలో బిజీగా మారిన మహిళా టైలర్లు



మద్దిగరువు సంతలో వస్త్ర దుకాణాల వద్ద రద్దీ

**సాక్షి, పాడేరు:** ఏజెన్సీలోని వారపు సంతలకు సంక్రాంతి శోభ నెలకొంది.. పండగకు ముందు సంతలు కావడంతో గిరిజనుల రద్దీ నెలకొంది . పాడేరు మండలం గుత్తులపుట్టు, జి.మాడుగుల మండలం మద్దిగరువులో గురువారం వారపు సంతలు జరిగాయి.ఈ సంతలకు గిరిజనులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పండగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేశారు. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్త్ర వ్యాపారులు తరలివచ్చి ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేశారు. పండగకు చివరి సంత కావడంతో అన్ని ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి నూతన వస్త్రాలు, గాజులు, చెప్పులు, పప్పులు, బెల్లం, నూనె తదితర సరకులు కొనుగోలు చేశారు.పాడేరు మండలం గుత్తులపుట్టు వారపుసంతకు పాడేరు, హుకుంపేట, పెదబయలు మండలాల గిరిజనులు భారీగానే తరలివచ్చారు.అలాగే జి.మాడుగుల మండలం మద్దిగరువు వారపు సంతకు సరిహద్దు ఒడిశాతో పాటు, ముంచంగిపుట్టు, పెదబయలు, చింతపల్లి, జి.మాడుగుల మండలాల గిరిజనులు తరలిరావడంతో సంతలో భారీగా వ్యాపారం జరిగింది.ఈ రెండు సంతలలోను భారీగా వస్త్ర వ్యాపారం జరిగింది.

**టైలర్లు బిజీ**

సంక్రాంతి పండగతో టైలర్లు బిజీగా మారారు. చేతినిండా పని ఉండడంతో టైలర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో కుట్టుపనితో ఉపాధి పొందుతున్న గిరిజన యువతులు అధికంగా ఉన్నారు. వారపు సంతల్లో టైలరింగ్ మిషన్లు ఏర్పాటుచేసి చకచకా దుస్తులు కుట్టి అందజేశారు. మద్ది గరువు వారపు సంతలో గిరిజన యువతులంతా కుట్టు పనిని హుషారుగా చేపడుతూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

## సురక్షిత తాగునీటితో వ్యాధులు దూరం



మందులను పరిశీలిస్తున్న రామిరెడ్డి, సుజల్‌నాయర్

**కొయ్యూరు:** సురక్షిత తాగునీరు తీసుకోవడంతో వ్యాధులకు దూరంగా ఉంటామని రాంకీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి రిసస్టయిన్‌బిలిటి ప్రతినిధి సుజల్‌నాయర్ అన్నారు. రావణాపల్లి గ్రామంలో వారు గురువారం ఆర్‌వో తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సురక్షిత నీటిని తాగడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా రాంకీ ఫౌండేషన్ అనేక చోట్ల ఆర్‌వో ప్లాంట్లను నిర్మాణం చేసిందని తెలిపారు.దీని అనంతరం అక్కడ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రపాలెం వైద్యుడు మనోజ్ఞ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ స్వామినాయుడు మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆయన కోరారు. వైద్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, సర్పంచ్ లక్ష్మి, సిబ్బంది హరికృష్ణ, సత్తిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు

## 29న మోదకొండమ్మ తీర్థం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

**సాక్షి,పాడేరు:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మతల్లి తీర్థమహోత్సవాన్ని ఈనెల 29వతేదీన ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం మోదమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోదకొండమ్మతల్లి ఆలయ వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఏటా మాదిరిగానే మోదకొండమ్మతల్లి ఒకరోజు తీర్థమహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అన్ని వర్గాల భక్తులు తీర్థమహోత్సవం నిర్వహణకు సహకారం అందించాలని కోరారు.ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు గిడ్డి వరలక్ష్మి, పూసర్ల గోపి, కొట్టగుళ్లి రామారావు, వెంకటరత్నం, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు,వర్తకులు పాల్గొన్నారు.

## జెడ్పీ చైర్‌పర్సన్ కుమ్మరిపుట్టు గ్రామ సందర్శన



కుమ్మరిపుట్టులో శ్రీమన్నారాయణ భక్తులతో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు:** మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామాన్ని గురువారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర గురువారం సందర్శించారు. సింహాద్రి అప్పన్న ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీమన్నారాయణ భక్తులతో మాట్లాడారు. గ్రామంలో సమస్యలను గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. పలు సమస్యలపై కుమ్మరిపుట్టు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులను గ్రామస్తులు సత్కరించారు.

**సింహాచలం బయలుదేరిన మాలధారులు**

మండలంలో 45 రోజుల పాటు దీక్ష చేపట్టిన సుమారు 300 మంది శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి మాలధారులు గురువారం సింహాచలం దేవస్థానానికి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, సర్పంచ్ వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సెలింగ్ కేంద్రాలతో ఆత్మహత్యల నివారణ

అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ కావూరి బుష్

**సీలేరు:** దేశంలో మానసిక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలు నివారించవచ్చని అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ (వర్జీనియా టెక్ కారిల్లాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, అమెరికా) కావూరి బుష్ అన్నారు. గురువారం సీలేరు విచ్చేసిన ఆయన మాట్లాడారు. భారతదేశంలో మానసిక వైద్య నిపుణులు తక్కువగా ఉన్నారన్నారు. ఆత్మహత్యలు చేసుకోవాలనుకునేవారు తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారన్నారు. అదేవిధంగా మద్యం, మత్తు పదార్థాల వినియోగం ఉన్నవారు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సీలేరు జడ్పీహైస్కూల్‌లో తాను ఒకటి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నట్టు బుష్ గుర్తు చేశారు. తాను చదువుకున్న స్కూల్‌ను తన పిల్లలకు చూపించడానికే కాకుండా పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

## జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో కృష్ణశ్రీకర్



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం అందుకుంటున్న గేదెల కృష్ణ శ్రీకర్(బ్లూ టీ షర్ట్)

**దేవరాపల్లి:** జాతీయ స్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు దేవరాపల్లి మండలం చిననందిపల్లి గ్రామానికి చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ అర్హత సాధించాడు. కేరళ రాష్ట్రం కొచ్చిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 24వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో సాబర్ విభాగం సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ కోసం పోటీపడుతున్నాడు. నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ప్రారంభమైన ఈ పోటీలు 14 వరకు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 7 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణశ్రీకర్ సత్తా చాటాడు. ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కృష్ణ శ్రీకర్ ప్రస్తుతం సంగివలసలోని శశి స్కూల్లో 8వ తరగతి చదువుతున్నారు. కృష్ణ శ్రీకర్ తండ్రి జి.నర్సింహమూర్తి కాంట్రాక్టర్ కాగా, తల్లి ఎస్‌బీటీఎస్ దేవి దేవరాపల్లి మండలంలోని కేజీబీవీలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. విశాఖపట్నంకు చెందిన జాతీయ స్థాయి శిక్షకుడైన కిష్టోఫర్ వద్ద కృష్ణశ్రీకర్ గత ఆరు నెలల నుంచి శిక్షణ పొందుతున్నాడు. రోజూ రెండు గంటలపాటు సాధన చేస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా కత్తిసాము క్రీడలో దూసుకుపోతున్న కృష్ణ శ్రీకర్‌ను పలువురు అభినందించారు.

## ఉపమాకలో ఘనంగా తిరువీధి సేవలు

ముగిసిన రాపత్తు ఉత్సవాలు



రాజాధిరాజ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

**నక్కపల్లి:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి నిత్యార్చనలు, అభిషేకాలు చేశారు. బాలభోగ నివేదన, రాజభోగ నివేదన, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. అంతకు ముందు పుష్పతోటలో నీరాట్టోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి ఉభయ దేవేరులతో కూడిన స్వామివారు రాజాధిరాజ వాహనంపైన ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 28వ పాశురాన్ని విన్నపం చేశారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం సాయంత్రం ఆలయంలో నిత్య కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం నమ్మాళ్వార్‌లు, భగవత్ రామానుజల వారిని పల్లకిలో ఆసీనులు చేసి వైష్ణవ స్వాములు మోస్తుండగా, ఆలయంలో అష్టదిక్పాలకుల వద్ద ఇరామానుశనూత్తన్దా సేవా కాలములతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ధ్వజస్తంభం వద్ద అధ్యాపక స్వామికి ఆలయ మర్యాద పూర్తి చేసిన తర్వాత ఆళ్వార్లను ఆలయంలోకి తీసుకెళ్లి నిత్య సేవా కాలం నిర్వహించారు. అనంతరం విశేష ప్రసాద నివేదన, తీర్థ గోష్టి కార్యక్రమాలు జరిగాయి. దీంతో పది రోజుల పాటు ఆలయంలో జరిగిన రాపత్తు అధ్యయనోత్సవాలు ముగిసినట్లేనని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు



జీసీసీ డీఎం సింహాచలం

**చింతపల్లి:** అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే గిరిజన సహకార సంస్థ లక్ష్యమని డివిజనల్ మేనేజర్ సింహాచలం అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులు పండించిన, సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు కల్పిస్తున్నామన్నారు. గిరిజనులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా జీసీసీని ఆశ్రయించాలన్నారు. రాజ్‌మా ఎరుపు చిక్కుళ్ల ధరను కిలో రూ.70 నుంచి రూ.75కు, తెలుపు చిక్కుళ్లు రూ.80 నుంచి రూ.90కు, ఉసిరిపప్పు రూ.60 నుంచి రూ.80కు, నల్లజీడి పిక్కలు రూ.10 నుంచి రూ.12కు, కరక్కాయ రూ.12 నుంచి రూ.15కు పెంచి కొనుగోలు చేస్తున్నామన్నారు. శీకాయ కిలో రూ.55కు, సామలు రూ.35 కొనుగోలు చేస్తున్నామన్నారు. రాజ్‌మా చిక్కుళ్లను ఇప్పటి వరకు 4 టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాఫీ పార్చిమెంట్ కిలో రూ.270, చెర్రి కిలో రూ.135కు కొనుగోలు చేస్తున్నామన్నారు. దళారుల కంటే అధిక ధరలు చెల్లించి తూనికల్లో మోసాలకు తావు లేకుండా కొనుగోలు చేస్తున్న జీసీసీని గిరిజనులు ఆశ్రయించాలని డీఎం కోరారు.



కంపుమానుపాకలులో రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న బీఎం మల్లేశ్వరరావు

**అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు**

**గూడెంకొత్తవీధి:** గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజన రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు, సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని గూడెంకొత్తవీధి జీసీసీ బ్రాంచి మేనేజరు మల్లేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి జీసీసీ ద్వారా జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలించారు. కంపుమానుపాకలు గ్రామంలో గిరిజన రైతులనుంచి రాజ్‌మా, కాఫీ వంటి ఉత్పత్తులను కొనుగోలు చేసి వారితో మాట్లాడారు. ఈ ఏడాది జీసీసీ అన్ని రకాల పంటలకూ మంచి ధరలను ప్రకటించిందన్నారు. ప్రస్తుతం రైతులు పండించే రాజ్‌మా మేలు రకం ఎరుపురంగు కిలో రూ.75కు కొనుగోలు చేస్తున్నామన్నారు. తెలుపురంగు రాజ్‌మాకు రూ.90 చెల్లిస్తున్నామన్నారు. కాఫీకి మంచి ధరలు ఇస్తున్నట్టు తెలిపారు. దళారుల మాయమాటలునమ్మి మోసపోవద్దని సూచించారు.



## ప్రియురాలి ఆత్మహత్య ప్రేరేపించిన నేరానికి ఏడేళ్ల జైలు

**చోడవరం రూరల్/కె.కోటపాడు:** వరుసకు చెల్లి అయినా ప్రేమించాడు.. పెద్దలు వద్దన్నా మాట వినలేదు.. మరొకరితో ఫోన్లో మాట్లాడుతోందని గొడవ పడ్డాడు.. ఆమె ఆత్మహత్యకు కారకుడయ్యాడు.. అంతేకాదు ఆమె మృతదేహాన్ని రహస్యంగా పూడ్చిపెట్టడానికి యత్నించి దొరికిపోయాడు. పోలీసుల దర్యాప్తులో నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 1500 రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.అరుణశ్రీ తీర్పు చెప్పారు. గురువారం తీర్పు వెలువడిన ఈ కేసు వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు తెలిపారు. నిందితుడు లెక్కల దేముడు దేవరాపల్లి మండలం వెంకటరాజుపురం గ్రామానికి చెందినవాడు. అదే గ్రామానికి చెందిన హతురాలు లెక్కల సంధ్య (23) నర్సింగ్ విద్యార్థిని. ఆమెతో నిందితుడు ప్రేమ వ్యవహారం నడపడంతో ఈ విషయం తెలిసిన ఇరువైపుల పెద్దలు వరుసకు చెల్లి, అన్నలైన ఇద్దరినీ మందలించారు. అయినా నిందితుడు దేముడునాయుడు సంధ్యను ప్రేమ పేరుతో వేధించడం మానలేదన్నది అభియోగం. ఈ నేపథ్యంలో 2018 ఆగస్టు 15 రాత్రి కె.కోటపాడు మండలం ఆర్లె గ్రామంలో ఉన్న నిందితుడి కోళ్ల ఫారమ్ వద్ద సంధ్య శవమై కనిపించింది. ఆమె మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి నిందితుడు గొయ్యిని తవ్వుతుండగా ఆర్లె గ్రామస్తులు, పెద్దలు చూసి నిలదీశారు. తనతో కాకుండా సంధ్య వేరొకరితో ఫోన్లో మాట్లాడుతుందని తెలిసి మందలించానని, ఆమె ఆత్మహత్యకు పాల్పడి చనిపోయిందని, వేరే దారి లేక పూడ్చిపెట్టడానికి గొయ్యి తవ్వుతున్నట్టు ఆర్లె గ్రామస్తులకు తెలిపాడు. తన చెల్లి సంధ్యను నిందితుడు వేధించి, ఆమె మృతికి కారకుడయ్యాడని, పూడ్చిపెట్టాలని చూశాడని హతురాలి అక్క బండారు భవాని కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆరోపించింది. అప్పటి కె.కోటపాడు ఎస్‌ఐ ఎం.వి.రమణ నిందితుడిపై ఐపీసీ 306, 201 సెక్షన్ల కింద అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలను విన్నమీదట నిందితుడిపై మోపిన నేరారోపణలు రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 1500 రూపాయల జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల కారాగార శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తక్షణం నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారు.

## రామసత్యనారాయణకు జాతీయ స్థాయి అవార్డు





అవార్డు స్వీకరిస్తున్న రామసత్యనారాయణ

**అచ్యుతాపురం(అనకాపల్లి):** అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంకు చెందిన కోరిబిల్లి రామసత్యనారాయణకు ఇన్నోవేటివ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డు దక్కింది. ఎస్‌ఆర్‌ఎస్‌కే కాలేజీ భీమవరంలో ఫ్యాకల్టీగా ఉన్న రామసత్యనారాయణకు మహారాష్ట్ర ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో టీ అండ్ పీ ఇన్నోవేటివ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డును అందజేసింది. దేశంలో మొత్తం మీద 20 మందికి ఈ అవార్డు రాగా, ఏపీ నుంచి రామసత్యనారాయణకు మాత్రమే దక్కింది. ఈ మేరకు ఎస్‌ఆర్‌ఎస్‌కే యాజమాన్యం, హరిపాలెం గ్రామస్థులు హర్షం ప్రకటించారు.

## అంతర్జాతీయ వర్సిటీగా ఏయూ



పాలక మండలి సభ్యుడు యేసుపాదంను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

- స్టార్టప్ రంగంలో సమష్టిగా పనిచేయండి
- ఏయూను సందర్శించిన విదేశీ ప్రతినిధులు

**ఏయూక్యాంపస్:** అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి తెలిపారు. అమెరికా, స్విట్జర్లాండ్, జర్మనీ దేశాల ప్రతినిధులతో ఏయూ సెనేట్ మందిరంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో ఏయూతో కలసి పనిచేయాలని ఆహ్వానించారు. ఇటీవల కాలంలో ఏయూలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందించే కేంద్రంగా ఏయూ నిలుస్తోందని తెలిపారు. విజ్ఞానానికి కేంద్రంగా, ఆవిష్కరణలకు నిలయంగా ఏయూను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆహ్వానించారు. ఏయూను స్వయంగా సందర్శించి విదేశాలలో ప్రచారం చేయాలని వీసీ సూచించారు. అనంతరం వీరు ఏయూలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు.

ఏయూ పాలక మండలి సభ్యుడు పి.ఏసుపాదం మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా, యూరప్ ఖండాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసే దిశగా ప్రయత్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ ఆచార్య శ్రీనివాస్, చీఫ్ వార్డెన్‌సీహెచ్ ఆశా ఇమ్మాన్యుయెల్ రాజు, డాక్టర్ రాజమాణిక్యం, డాక్టర్ కె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డిని సత్కరించారు. ఏయూ తరఫున పాలక మండలి సభ్యులు యేసుపాదంను సత్కరించారు.

## పోయిన లక్ష ఇప్పించారు





బాధితురాలు కవితకు లక్ష నగదుతో కూడిన బ్యాగును అందజేస్తున్న డీసీపీ నాగన్న

**అల్లిపురం (విశాఖ దక్షిణం):** ఆటోలో పోగొట్టుకున్న రూ.లక్షను బాధితురాలికి మూడు గంటల్లోనే డీసీపీ సమక్షంలో అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురానికి చెందిన కవిత అనే మహిళ బుధవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో తన షాపింగ్ ముగించుకుని జగదాంబ వద్ద ఆటో ఎక్కి రైల్వేస్టేషన్ వద్ద దిగారు. దిగినప్పుడు ఆటోలో తన హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయారు. అందులో లక్ష రూపాయలున్నాయి. వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం ఎస్‌ఐ పైడంనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి, మూడు గంటలలోనే ఆటోను గుర్తించారు. ఆటో గల బ్యాగులో రూ.లక్ష భద్రంగా ఉండడంతో క్రైం డీసీపీ నాగన్న దానిని బాధితురాలు కవితకు సూర్యాబాగ్ పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్రాంత ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడిగా రాపేట

**మాడుగుల రూరల్:** ఏపీ విశ్రాంత ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడిగా రాపేట రామకొండలరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం తెలిపారు. బుధవారం గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యవర్గంలో అనకాపల్లి జిల్లా నుంచి రామకొండలరావు ఎన్నిక కావడంతో విశ్రాంత ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గతంలో కె.జె.పురం ఎంపీపీ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు.